## ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి



సారంగపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రి రూరల్, మే 22 : జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెను వెంటే రైసుమిల్లులకు తరలించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం మందమర్రి మండలం బొక్కలగుట్టలోని తెలంగాణ క్రీడా ప్రాంగణం, సారంగపల్లి, గుడిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సతీశ్‌తో కలిసి సందర్శించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది ఉన్నారు.


**మౌలిక వసతుల కల్పనకు చర్యలు..**

మందమర్రి, మే 22 : మందమర్రి మున్సిపాలిటీ పరిధి ప్రాణహిత కాలనీ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. డబుల్ బెడ్రూంలను సందర్శించిన కలెక్టర్, లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇప్పటి వరకు లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్లలో తాగునీరు, విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సతీశ్ కుమార్, అధికారులు ఉన్నారు.

## కొనుగోలు ప్రక్రియ పూర్తిచేయాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 22 : అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. హైదరాబాద్ నుంచి గురువారం ఇతర ఉన్నతాధికారులతో కలిసి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో అకాల వర్షాలు, వరి ధాన్యం కొనుగోలు, వానకాలం పంటల సన్నద్ధం అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 2, 3 రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి జనజీవనానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్నివెంటనే కొనుగోలు చేయాలని, రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు వినోద్, స్వామి, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

కాగజ్‌నగర్, మే 22 : ప్రభుత్వం అందిస్తున్నా శిక్షణ తరగతలను సద్వినియోగం చేసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఈవో యాదయ్య, అదనపు డైరెక్టర్ శ్రీనివాస చారి పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్)లో కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి, తగిన మార్గదర్శనంతో బోధించాలన్నారు. తరగతి గదులు ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలని, ఇంటరాక్టివ్ ప్యానెల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన వేదికలను ఉపయోగించుకోవాల సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిఫాం కుట్టు కేంద్రాలను పరిశీలించారు. 25వ తేదీ వరకు పూర్తిస్థాయి యునిఫాం తయారుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఎంఈవో వాసాల ప్రభాకర్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఆబిద్ అలీ, జిల్లా రిసోర్స్ పర్సన్ పుల్లూరి బాలకిషన్, రిసోర్స్ పర్సన్లు మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'అనర్హులకు షెట్టర్ల కేటాయింపు'

బెల్లంపల్లి, మే 22 : పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయంలో అనర్హులకు షెట్టర్లు కేటాయిచారని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ ఆరోపించారు. బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, యూత్ పట్టణ అధ్యక్షుడు సబ్బని అరుణ్‌కుమార్, నాయకులు మద్దెల గోపి, పైడిమల్ల చంద్రశేఖర్, దాగం చరణ్, ఆడెపు అరుణ్‌తో కలిసి గురువారం ఆయన మాట్లాడారు. మార్కెట్, బెల్లంపల్లితో సంబంధం లేని వ్యక్తులను లబ్ధిదారులుగా చేర్చి, షెట్టర్ల కేటాయంపులో పూర్తిగా అవకతవకలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత సోదరిమణి మణిగంధం సౌజన్య, పోచంపల్లి యశోధ, ఆరు నెలల క్రితం వివాహమైన మాజీ కౌన్సిలర్ కొమ్ముల సురేశ్ భార్య తోకల మౌనిక, మరో మాజీ కౌన్సిలర్ కొడుకు రాములు నాయక్ కుమారుడు శివ రామ్ నాయక్, బంధువు అజ్మీరాదేవీ బాయికి అప్పనంగా షెట్టర్లు కేటాయించారని ఆరోపించారు. వీరికి కనీసం మార్కెట్ క్రయ విక్రయాలతో సంబంధం లేదని విమర్శించారు. ఆరు నెలల క్రితం వివాహమైన మాజీ కౌన్సిలర్ తన భార్య పేరిటి షెట్టర్ కాజేశాడని మండిపడ్డారు. షెట్టర్ల కేటాయింపులో లక్షలాది రూపాయలు చేతులు మారాయని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించి, జాబితా నుంచి అనర్హులను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశార. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విడుతల వారీగా మార్కెట్ భవన నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరయ్యాయని గుర్తుచేశారు. మార్కెట్ భవనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తామే అంతా చేసినట్లు గొప్పలు చెబుతూ ప్రారంభోత్సవాలు చేశారని ఆరోపించారు.

## సరస్వతీ పుష్కరాల్లో మాజీ ఎమ్మెల్యే కుటుంబం



స్నానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, కుటుంబ సభ్యులు

మంచిర్యాలటౌన్, మే 22 : కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాల్లో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఆయన సతీమణి రాజకుమారి, తనయుడు విజిత్‌రావు, కోడలు ఉదయశ్రీ, మనుమడు నిర్వాన్, మనుమరాలు వీక్ష పాల్గొన్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వరుడిని, మహాసరస్వతి దేవిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

## నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు

తాండూర్, మే 22 : తాండూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జ్యోత్స్నను గురువారం మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవి శ్రీరాములు మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. అలాగే మండలంలోని వివిధ పార్టీల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కొండాపూర్ యాప వద్ద చెరువుగా రోడ్డు



కొత్త తిరుమలాపూర్‌లో బురదతో నిండుకున్న గ్రామం

# ఈ దారులు.. బురదమయం

- చెరువును తలపిస్తున్న కొండాపూర్ యాప చౌరస్తాలోని రహదారి
- కొత్త తిరుమలాపూర్‌లో చిత్తడిగా అంతర్గత రోడ్లు
- ప్రజల అవస్థలు.. పట్టించుకోని అధికారులు

కాసిపేట, మే 22 : కాసిపేట మండలం కొండాపూర్ యాప చౌరస్తాలోని ప్రధాన రహదారి చెరువును తలపిస్తున్నది. రోడ్డు పూర్తిగా ధ్వంసమై, భారీ గుంతలుపడగా, వర్షానికి నీరు చేరి బురదకూపంగా మారింది. దేవాపూర్ సిమెంట్ కంపెనీతో పాటు, ప్రధాన గ్రామాలు ఈ ప్రాంతంలో ఉండడంతో ఈ దారి గుండా నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు, వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారవడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. నాయకులు, అధికారులు ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారే తప్ప రోడ్డు వేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**బురదే వీరికి రోడ్డు..**

ఆదివాసీ గిరిజన గ్రామం కొత్త తిరుమలాపూర్ వాసులకు బురద రోడ్డే దిక్కైంది. అంతర్గత రోడ్డు లేకపోవడంతో వర్షం పడిందో లేదో.. బురదే దర్శనమిస్తున్నది. లోతుగా ఉన్న బురదలోనే గిరిజనులు నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నిల్చునేందుకు కూడా స్థలం లేదని, గ్రామం మొత్తం కూడా బురదతో నిండుకున్నదని వాపోతున్నారు. అంతర్గత రోడ్లు నిర్మించాలని ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు.



మందమర్రిలో మున్సిపల్ అధికారులు



నస్పూర్ : మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల టౌన్ : మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా

# భాగ్యరెడ్డి వర్మ సేవలు చిరస్మరణీయం

మంచిర్యాల టౌన్, మే 22 : సంఘ సంస్కర్త ఎంవీ భాగ్యరెడ్డి వర్మ సేవలు చిరస్మరణీయమని, అందరికీ ఆదర్శనీయులని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సీపీ మాట్లాడుతూ.. సంఘసంస్కర్త భాగ్యరెడ్డివర్మ హైదరాబాద్ సంస్థానంలో సంఘ సంస్కరణకు కృషిచేసిన మహోన్నతుడని తెలిపారు. ఆంధ్రసభ స్థాపకుడిగా హైదరాబాద్‌లో దళిత పాఠశాలను ప్రారంభించి, దళిత అభ్యున్నతికి ఎంతగానో కృషిచేశారరన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘువేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, మల్లేశం, సీపీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ టౌన్ : భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి కమిషనర్ తౌటం శివాజీ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ప్రజానీకానికి చేసిన సేవలను కొనియాడారు. కార్పొరేషన్ మేనేజర్ కరుణాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్‌లో..**

నస్పూర్, మే 22 : నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయ చిత్రపటానికి కలెక్టర్ కుమార్ దీపక్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బాల్య వివాహాలు, అంటరానితనం, దేవదాసి, జోగిని వ్యవస్థలను రూపుమాపేందుకు అనేక పోరాటాలు చేశారన్నారు. జిల్లా అధికారులు పోటు రవీందర్‌రెడ్డి, చాతరాజుల దుర్గా ప్రసాద్ , వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో..**

ఆసిఫాబాద్ టౌన్, మే 22 : కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు సజీవన్, వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే హాజరయ్యారు. భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. మహనీయుల చరిత్ర, త్యాగాలను భావితరాలకు అందించాలని పేర్కొన్నారు.

**ఎస్పీ కార్యాలయంలో..**

జిల్లా పోలీస్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి ఎస్పీ డీవీ శ్రీనివాస రావు పూలమాలవేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం కృషి చేసిన దళిత ఉద్యమ పితామహుడు, సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో**

మందమర్రి, మే 22 : మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి మున్సిపల్ ఏఈ సందీప్, ఆర్ఐ కృష్ణ ప్రసాద్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఏ రాణి, బంగారి శ్రీనివాస్, ఎం మనోజ్ కుమార్, సాయి నిఖిల్, ప్రశాంత్, శిరీశ్, బీ శ్యాంబాబు, ప్రభాకర్‌రెడ్డి, మెప్మా టీఎంసీ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ శిబిరం ప్రారంభం



కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

సీసీసీ నస్పూర్, మే 22 : సీసీసీ నస్పూర్ విద్యానగర్ కృష్ణవేణి హైస్కూల్‌లో ఉచిత సమ్మర్ శిబిరాన్ని ప్రధానోపాధ్యాయుడు బత్తిని దేవన్న ప్రారంభించారు. 5 నుంచి 15 ఏళ్లలోపు బాల బాలికల కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరం 31వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విబిరం సమన్వయకర్త బత్తిని రాకేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీడ్కోలు కార్యక్రమం



సత్యనారాయణను సన్మానిస్తున్న అధికారులు

బెల్లంపల్లి, మే 22 : మందమర్రి ఏరియా శాంతిఖని గని సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ సేవలు మరువలేనివని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. గని నుంచి మందమర్రి ఏరియాకు డిప్యూటేషన్‌పై బదిలీగా వెళ్తున్న ఆయనకు గురువారం గని ఆవరణలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గని పిట్ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్, యూనియన్ నాయకులు, గని అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## పాఠశాలలను బలోపేతం చేయాలి

హాజీపూర్, మే 22 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో పోటు తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని ముల్కల్ల జడ్పీ పాఠశాలలో కొనసాగుతున్న ప్రైమరీ లెవల్ టీచర్ ట్రైనింగ్‌ను గురువారం సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధించేలా ఉపాధ్యాయులందరూ శిక్షణ తీసుకోవాలని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యావనరుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నెన్నెల పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ

నెన్నెల, మే 22 : నెన్నెల పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ భాస్కర్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నేరాల నియంత్రణ, అదుపుపై అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణ, తోటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలతో స్నేహ భావంతో ఉండాలని సూచించారు. నేరాల అదుపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలను శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. గంజాయి, అక్రమ రవాణా, జూదం లాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట సీఐ అబ్జలుద్దీన్, ఎస్ఐ ప్రసాద్ ఉన్నారు.

## ఆపత్కాలంలో అండగా ఉంటాం

నిర్మల్ అర్బన్, మే 22 : రానున్న వర్షాకాలంలో జిల్లా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అపత్కాలంలో సహాయక చర్యలు అందించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉందని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల అన్నారు.జిల్లా ప్రజలకు వర్షాల వల్ల ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖా పరంగా ముందస్తు ఏర్పాట్లలో బాగంగా గురువారం సాయుధ దళ కార్యాలయంలో ఫ్లడ్ రిలీఫ్ కోసం ఏర్పాటు చేసిన సామాగ్రిని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా నిర్మల్ జిల్లాలోని కడెం, స్వర్ణ, గడ్డెన్న ప్రాజెక్టులు పూర్తిగా నిండనున్న దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పోలీస్ శాఖ పరంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఇందుకోసం పోలీసు అధికారులంతా సమాయాత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రాం నిరంజన్, రమేశ్, ఆర్ఎస్ఐలు రవి కుమార్, రాజశేఖర్, సాయి కృష్ణ ఉన్నారు.



వరద సహాయ చర్యల కోసం పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

## భూ సర్వే అడ్డగింత



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ భోజన్న

కాసిపేట, మే 22 : కాసిపేట మండలం వరిపేట శివారులో రెవెన్యూ అధికారుల భూ సర్వేను పలువురు గ్రామస్తులు అడ్డుకున్నారు. కొందరు రైతులు తమ భూమికి సంబంధించి సర్వేచేయాలని దరఖాస్తు పెట్టుకోగా, ఈ ప్రాంత రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు అందించి సర్వే కోసం వచ్చారు. దీంతో పలువురు రైతులు సర్వే అడ్డుకున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి మోకలో ఉన్నామని, కొందరు అక్రమంగా పట్టాలు చేసుకొని భూముల కోసం వస్తున్నారని రైతులు ఆరోపించారు. సర్వే చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని రెవెన్యూ అధికారులు రైతులకు తెలుపగా, దానికి వారు అంగీకరించలేదు. సంఘటనా స్థలంలో పలువురు రైతులు వర్గాలుగా విడిపోయి గొడవలు పడగా, తహసీల్దార్ భోజన్న శాంతింపచేశారు. అందరూ సహకరిస్తేనే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. సర్వే నిలిపి వేస్తున్నామని, సివిల్ సమస్య అని, కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని అక్కడి నుంచి పంపించేశారు.

## వృత్తి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

రామకృష్ణాపూర్, మే 22 : యూఎన్ఎక్స్‌టీ అధ్వర్యంలో 30 రోజుల పాటు ఇచ్చే నైపుణ్య శిక్షణను సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల పూర్వ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మందమర్రి టీజీ డబ్ల్యూఆర్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2016లో ఇంటర్ పూర్తిచేసిన 25 ఏండ్లలోపు యువతులు, గురుకుల సొసైటీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. 30వ తేదీలోగా 79950 10571 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## జీవవైవిధ్య దినోత్సవం

సారంగాపూర్, మే 22 : మండలంలోని చించోలి(బి) గండిరామన్న అర్బన్ పార్కులో గురువారం అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో నజీర్‌ఖాన్ మాట్లాడుతూ చెట్లు ఎంత ముఖ్యమో జీవాలు కూడా అంతే ముఖ్యంగా ఉంటాయన్నారు. చెట్లను ఎలా కాపాడుతామో జీవాలను కూడా ప్రతి ఒక్కరూ కాపాడాలన్నారు. అనంతరం జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. ఇందులో ఎఫ్ఎస్‌వోలు రషీద్, వేణుగోపాల్ ఫారుఖ్‌అలీ, ఎఫ్‌బీవోలు భీమేష్, సంతోష్, మీనా, సంధ్య, శ్రావణి పాల్గొన్నారు.

## పేకాటలో జైపూర్ కాంగ్రెస్ లీడర్ల అరెస్ట్

మంచిర్యాల, మే 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పేకాట ఆడుతూ జైపూర్ కాంగ్రెస్ లీడర్లు పట్టుబడ్డారు. కరీంనగర్ జిల్లా రేకుర్తిలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న 13 మందిని బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఈ సమయంలో పోలీసులు తీసిన వీడియో స్థానికంగా సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. పేకాట ఆడుతున్న కాంగ్రెస్ లీడర్లు పట్టుబడ్డారంటూ సోషల్‌మీడియాలో పోలీసులు తీసిన వీడియో చక్కర్లు కొట్టింది. ఈ వీడియోలో జైపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాగర్‌రావు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. ఆ లీడర్ల తీరుపై మండల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. బాధ్యతాయుతంగా ఉండాల్సిన లీడర్లే జూదం ఆడుతూ పోలీసులకు దొరకడం ఏమిటని చర్చించుకుంటున్నారు.

## వైన్స్‌లో చోరీ

సీసీసీ నస్పూర్, మే 22 : నస్పూర్‌కాలనీ తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలోని ఏఎస్ఆర్ వైన్స్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఏఎస్ఐ ఎజాస్ తెలిపారు. నిర్వాహకులు గురువారం ఉదయం 10 గంటలకు షాప్ తీసేందుకు రాగా, షెట్టర్ తాళం పగులగొట్టి ఉంది. దీంతో వెంటనే వారు సీసీసీ నస్పూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వైన్స్ వద్దకు చేరుకొని, దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. షాపులోని రూ.12 వేలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

లక్షెట్టిపేట, మే 22 : మున్సిపాలిటీలోని మోడలకు చెందిన ఎలగతి శ్రీలత (29) ఈ నెల 19న పురుగుల మందు తాగగా, బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సురేశ్–శ్రీలతకు కూతురు ఆద్య శ్రీ (6), కొడుకు మహన్స్(3) ఉన్నారు. కూతురికి చిన్నప్పటి నుంచి అనారోగ్యంగా ఉండడంతో దవాఖానలో చూపించినా నయంకాకపోవడంతో ఇల్లు మార్చాలని, వేరే కాపురం పెడుదామని భర్తను కోరేది. అది కుదరకపోవడంతో మనస్తాపం చెంది, 19న ఇంట్లో గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని దవాఖాకు తరలించగా, పరిస్థితి విషమించి మృతిచెందింది. శ్రీలత తండ్రి సందేల మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సోలార్‌ప్లేట్ల దొంగపై కేసు

నెన్నెల, మే 22 : నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామంలోని రైతులు పంట చేలలో ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్లేట్లను దొంగతనం చేసి అమ్ముతున్న అదే గ్రామానికి చెందిన కాలువ సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. గొల్లపల్లికి చెందిన రైతు సరండ్ల భూమయ్య తన పొలంలో పంట రక్షణ కోసం అమర్చుకున్న సోలార్ ప్లేట్లను సతీశ్ దొంగతనం చేశాడు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

## భారీ వాహనాలకు జరిమాన



డ్రైవర్, క్లీనర్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ స్వరూప్‌రాజ్

హాజీపూర్, మే 22 : హెచ్చరికలు లేకుండా 63వ జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన భారీ వాహనాలకు హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ జరిమానా విధించినట్లు తెలిపారు. గురువారం ఉదయం మండలంలోని జాతీయ రహదారిపై పది భారీ వాహనాలు నిలిపి ఉండడంతో గమనించిన ఎస్ఐ ఆరా తీశారు. రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు జరిమానా విధించారు. అనంతరం డ్రైవర్లు, క్లీనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

## విద్యుదాఘాతంతో ఆవు మృతి

దండేపల్లి, మే 22 : దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామంలో గోళ్ల తిరుపతికి చెందిన ఆవు గురువారం సమీపంలోని ఇనుప స్తంభానికి తగిలి విద్యుదుఘాతంతో మృతి చెందింది. దాని విలు రూ.50 వేలు ఉంటుందని, న్యాయం చేయాలని బాధితుడు కోరాడు. కాగా, ఇంటికి సమీపంలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభానికి షాక్ వస్తున్నదని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని వాపోయాడు.

## పహానీలు అందించాలి

జైనూర్, మే 22 : ఏజెన్సీలోని దళిత రైతులకు పహానీలు అందించాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు కాంబ్లె బాబాసాహెబ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏజెన్సీలో 70 ఏళ్ల నుంచి భూములు సాగు చేసుకుంటున్న దళిత రైతులకు పహానీలు ఇచ్చి, బ్యాంకు రుణాలు అందించాలని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో సమస్యను త్వరలో పరిష్కరించి, ఆదుకోవాలని కోరారు.

## డిస్పెన్సరీలో ఔషధాల సరఫరా

శ్రీరాంపూర్, మే 22 : తమ యూనియన్ కృషి ఫలితంగానే సింగరేణి డిస్పెనర్సరీల్లో కార్మిక కుటుంబాలకు ఔషధాలు సరఫరా చేస్తున్నట్లు ఏఐటీయూసీ నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఎస్కే బాజీసైదా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాంకేతిక లోపం వల్ల 2 నెలల నుంచి కార్మికులు, రిటైర్డ్ కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు ఔషధాలు సరిపడా అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ విషయంపై తాము యాజమాన్యంతో చర్చించడంతో వెంటనే లోపాలను సవరించి, పూర్తిస్థాయిలో మందులు పంపిణీ చేస్తున్నదని పేర్కొన్నారు.

## హనుమాన్ జయంతి

మందమర్రి, మే 22 : మందమర్రి పట్టణంలోని పాలచెట్టు ఏరియాలో గల పంచముఖి ఆలయ రజతోత్సవ వేడుకలు గురువారం ముగిశాయి. ఈ ఆలయంతో పాటు పట్టణంలోని ఇతర ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. చిన్న జీయర్ స్వామి సారథ్యంలో రామనాథ జీయర్ స్వామి పర్యవేక్షణలో 108 మంది అర్చకులు వైభవంగా నిర్వహించారు. మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి, సింగరేణి జీ దేవేందర్, ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఎస్ఐలు రాజశేఖర్, భూమేశ్ ఉన్నారు.

## కోనప్పకు కరెంట్ షాక్

కౌటాల, మే 22 : సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప గురువారం రాత్రి విద్యుదాఘాతానికి గురయ్యారు. తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్తంపేట కొనుగోలు కేంద్రం వద్ద వర్షానికి ధాన్యం తడుస్తున్నదన్న విషయం తెలుసుకున్న కోనప్ప రాత్రి అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో ధాన్యం వద్దకు పశువులు, అడవి జంతువులు రాకుండా రైతులు అమర్చిన సోలార్ ఫెన్సింగ్ తీగలకు ఆయన తగలడంతో షాక్‌కు గురయ్యారు. వెంటనే అక్కడి నుంచి పక్కకు జరుగడంతో ప్రమాదం తప్పింది.